క్లుప్తంగా

స్కూల్‌బ్యాగ్స్ పంపిణీ



స్కూల్‌బ్యాగులను చూపుతున్న విద్యార్థులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్, నిజాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 8, 9వ తరగతి విద్యార్థులకు సోమవారం స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి దండు అంజయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధంగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. మహిత స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయని కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రుద్రప్ప, సురేష్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శ్రీశైలం, సీఆర్పీలు రాజేశ్వర్, నాగేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థికి దివ్య ఖురాన్ గ్రంథాన్ని అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో సోమవారం స్థానిక మైనార్టీ సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో దివ్య ఖురాన్ పఠన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్య ఖురాన్‌ను పఠించిన విద్యార్థులను సన్మానించి ఖురాన్ గ్రంథాలను పంపిణీ చేసి అభినందించారు. గురుకుల ప్రిన్సిపాల్ అబ్దుల్‌ఖాదర్, కౌన్సిలర్ దారం శంకర్, మైనార్టీ సంక్షేమ కమిటీ బాధ్యులు తాహెర్‌అలీ, మైనొద్దీన్, సుబూర్, మోయిన్, అబ్దుల్లా, రశీద్, యూసుఫ్, మాజీ ఎంపీపీ జీవులానాయక్, నాయకులు పండరిరెడ్డి, రాజు, జానిపటేల్, నవాబ్ పాల్గొన్నారు.

జాతరతో ఆధ్యాత్మిక వాతావరణం



మల్లికార్జునస్వామిని దర్శించుకుంటున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు: జాతర నిర్వహణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంటాయని ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని నందిగామ గ్రామంలో భ్రమరాంబికా మల్లికార్జునస్వామి జాతర, బీరప్పస్వామి కల్యాణ మహోత్సవానికి నీలం మధు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భ్రమరాంబికా, మల్లికార్జునస్వామి అందరినీ చల్లగా చూడాలని ఈ సందర్భంగా ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పల్లె శ్రీశైలం, నాయకులు రాములు, ఆంజనేయులు, రాజేందర్, నర్సింహులు, ఆంజనేయులు, ఈశ్వర్, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

13 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 13మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు సోమవారం జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గత శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందిని ఆదుపులోనికి తీసుకొని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

సౌకర్యాలు కల్పించాలని విద్యార్థుల నిరసన

పుల్‌కల్(అందోల్): మండల పరిదిలోని బస్వాపూర్ ఆదర్శ పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు తరగతులను బహిష్కరించి పాఠశాల ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల నిరసనకు ఏబీవీపీ సంఘం సంఘీభావం తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని విద్యార్థుల సమస్యలను పరిష్కరించేవిధంగా అధికారులతో మాట్లాడుతామని హామీనివ్వడంతో నిరసన విరమించారు.

వసతి గృహం.. ఆహ్లాదం

హరితవనంగా దౌల్తాబాద్ బీసీ హాస్టల్

- ఆవరణంతా పచ్చందాలు
- స్వాగతిస్తున్న పచ్చని చెట్లు
- చల్లని వాతావరణంలో చదువులు



హాస్టల్ ఆవరణలో మొక్క నాటుతున్న అప్పటి కలెక్టర్ రోనాల్డ్ రోస్ (ఫైల్)



పచ్చని చెట్ల మధ్యన దౌల్తాబాద్ బీసీ హాస్టల్

హత్నూర(సంగారెడ్డి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం పథకంలో భాగంగా నాటిన మొక్కలతో సంక్షేమ హాస్టల్ హరితవనాన్ని తలపిస్తోంది. మొక్కల పెంపకంలో విద్యార్థులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా ఏపుగా పెరిగి చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వసతి గృహానికి వచ్చే వారికి పచ్చదనంతో పాటు చల్లటి గాలితో స్వాగతం పలుకుతున్నాయి.

హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ బీసీ వసతి గృహం ఆవరణలో హరితహారంలో భాగంగా మూడేళ్ల క్రితం నాటిన మొక్కలను విద్యార్థులు, సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకొని కంటికి రెప్పల్లాగా మొక్కలను కాపాడి పెంచారు. దీంతో హాస్టల్ ఆవరణలోని చెట్లు చల్లటి ఆహ్లాదకరాన్ని అందిస్తున్నాయి. వసతి గృహం ఆవరణలో ఏడేళ్ల క్రితం అప్పటి కలెక్టర్, ప్రస్తుత జీహెచ్ఎంసీ కమిషనర్‌గా పనిచేస్తున్న రోనాల్డ్ రోస్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. అప్పట్లో ప్రత్యేకంగా రోనాల్డ్ రోస్ ఈ హాస్టల్‌పై శ్రద్ధ తీసుకొని మొక్కలతో పచ్చదనం పంచేందుకు అధికారులను, విద్యార్థులను ఎప్పటికప్పుడు ప్రోత్సహించేవారు. దీంతో నాటిన మొక్కలన్నింటిని విద్యార్థులు దత్తత తీసుకొని ప్రత్యేకంగా పెంచారు. దీనికి తోడు వసతిగృహం అధికారి శంకర్, ఫీల్డ్‌అసిస్టెంట్ సాయిలు మొక్కల సంరక్షణ బాధ్యత తీసుకున్నారు. మూడేళ్లలో మొక్కలు పెద్ద పెద్ద చెట్లుగా ఎదిగి వసతి గృహం హరితవనంగా మారింది. దౌల్తాబాద్ బీసీ హాస్టల్‌ను ఆదర్శంగా తీసుకొని సిరిపూర్ బీసీ వసతిగృహంలో మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. దీంతో వసతిగృహాలను సందర్శిస్తున్న అధికారులు విద్యార్థులు, వసతి గృహాల అధికారులు, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. జిల్లాలోనే దౌల్తాబాద్ బీసీ హాస్టల్ పచ్చదనంలో ఆదర్శంగా నిలిచిందని ఉన్నతాధికారులు, స్థానిక నాయకులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

స్వచ్ఛమైన వాతావరణంలో చదువులు



హాస్టల్ మొత్తం పచ్చదనంతో నిండుకుంది. హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. విద్యార్థులు సైతం శ్రమపడి మొక్కలను పెంచారు. స్వచ్ఛమైన గాలితో విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉంటున్నారు.

– శంకరయ్య: దౌల్తాబాద్ బీసీ హాస్టల్ వార్డెన్

శ్రమకు ఫలితం దక్కింది



అప్పటి కలెక్టర్ రోనాల్డ్‌రోస్ ఆదేశాలతో ఎంతో కష్టపడి మొక్కలను పెంచాం. దీంతో హాస్టల్ ఆవరణ పూర్తిగా ఆహ్లాదకరంగా పచ్చదనంతో స్వాగతం పలుకుతోంది. శ్రమకు తగిన ఫలితం దక్కడంతో ఆనందంగా ఉంది. విద్యార్థులు సైతం శ్రమపడి మొక్కలకు నీళ్లు పోశారు.

– ఫీల్డ్ అసిస్టెంట్, సాయిలు

ఇష్టపడి చదివితే.. ఉత్తమ ఫలితాలు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారంలోని ఫంక్షన్ హాల్‌లో జిన్నారం, గుమ్మడిదల, బొల్లారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సోమవారం మోటివేషన్ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు అత్యంత కీలకమని, పరీక్ష సమయంలో విద్యార్థులు ఒత్తిడికి లోను కావొద్దన్నారు. మోటివేషన్ తరగతులను శ్రద్ధగా విని ఇష్టంగా పరీక్షలను రాయాలని సూచించారు. విద్యార్థులకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంఈఓ జెమినీకుమారి, గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

అంగన్‌వాడీలపై చిన్నచూపు తగదు

జోగిపేట(అందోల్): అంగన్‌వాడీలపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు తగదని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ అన్నారు. వివిధ రంగాల్లో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో అంగన్‌వాడీలు పాల్గొననున్నట్లు జోగిపేట ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీలతో కలిసి సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో ఐసీడీఎస్ రక్షణకు బడ్జెట్ కేటాయించకపోవడం దారుణమన్నారు. నిత్యావసర ధరలు పెంచుతూ పేద ప్రజలు నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. తక్షణమే కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాలు ఇందిరమ్మ, సేకమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీలు

నిధుల కేటాయింపుపై రగడ

- సమావేశం ఛాంబర్ ఎదుట కౌన్సిలర్ల బైఠాయింపు
- రూ.6.40కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం
- రసాభాసగా సర్వసభ్య సమావేశం



సమావేశం చాంబర్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు

జిన్నారం(పటాన్‌చెరు): తమకు అనుకూలంగా ఉన్న కౌన్సిలర్ల వార్డుల అభివృద్ధికి మాత్రమే నిధులు కేటాయిస్తున్నారని, సొంత పార్టీలో తాము ఉన్నా కూడా నిధులు కేటాయించటంలేదని ఆరోపిస్తూ సభ్యులు సర్వసభ సమావేశ చాంబర్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. బొల్లారం మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని చైర్‌పర్సన్ రోజారాణి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె 34అంశాలతో కూడిన అజెండాను చదువుతుండగా వైస్‌చైర్మన్ అనిల్‌కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు చంద్రారెడ్డి, నిహారిక, చంద్రయ్య, సంతోష, గోపాలమ్మ, జయమ్మ, సంధ్య అడ్డుకొని తమ వార్డులకు ఎందుకు నిధులు కేటాయించలేదని చైర్‌పర్సన్, కమిషనర్‌ను నిలదీశారు. నాలుగేళ్ల నుంచి ఇదే తంతును కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అజెండా కాపీలని చించివేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ గత నాలుగేళ్లగా తమ వార్డులకు ఎలాంటి నిధులు కేటాయించడం లేదని, ఈ విషయమై ప్రశ్నిస్తే తమను చిన్నచూపు చూస్తున్నారని వాపోయారు. బీఆర్ఎస్‌లో ఉన్నా తమ వార్డులకు నిధులు కేటాయించకపోవటం ఏంటని కౌన్సిలర్ చంద్రారెడ్డి ప్రశ్నించారు. త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి వెళ్తామని, నిధులు ఎలా రాబట్టాలో తమకు తెలుసు అని చెప్పారు. అంతేకాకుండా నిధుల కేటాయింపు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం చైర్‌పర్సన్ రోజారాణి ఆధ్వర్యంలో రూ.6.40కోట్ల పనులకు కౌన్సిల్ సభ్యులు తీర్మానం తెలిపారు. ఈ విషయమై కమిషనర్ సంగారెడ్డిని వివరణ కోరగా చైర్‌పర్సన్ రూపొందిన అజెండాను తాము ఆమోదించామని వివరించారు. సభ్యులకు నిధులు అవసరమని సమావేశం దృష్టికి తీసుకువస్తే తక్షణమే ఆమోదించేవిధంగా చర్యలు తీసుకుంటామని, అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయించేవిధంగా చూస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఆర్ఓ శ్రీధర్, ఆయా శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'బొల్లారం' బీఆర్ఎస్‌లో చీలికలు

- నేడు కాంగ్రెస్‌లో చేరనున్న ఐదుగురు కౌన్సిలర్లు
- బొల్లారం మున్సిపాలిటీలో రసవత్తర రాజకీయాలు



బొల్లారం మున్సిపల్ కార్యాలయం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో సుమారు 60వేల వరకు జనాభా ఉంటుంది. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఇక్కడ జీవనం సాగిస్తున్నారు 22 వార్డులతో కలిసి నాలుగేళ్ల క్రితం బొల్లారం మున్సిపాలిటీగా ఆవిర్భవించింది. 2013లో టీడీపీ నుంచి సీనియర్ నాయకుడు చంద్రారెడ్డి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతర కాలంలో కౌన్సిలర్‌గా ఎన్నికైన చంద్రారెడ్డి మున్సిపల్ చైర్మన్ రేసులో ఉండగా అదే పార్టీలో ఉన్న బీఆర్ఎస్ నేత బాల్‌రెడ్డి సతీమణి రోజారాణి అనూహ్యంగా చైర్ పర్సన్‌గా ఎన్నికయ్యారు. దీంతో బాల్‌రెడ్డి, చంద్రారెడ్డి బీఆర్ఎస్‌లో ఉన్నా ఇద్దరి మధ్య సయోధ్య కుదరడం లేదు. చంద్రారెడ్డి, బాల్‌రెడ్డి స్వయానా మమాఅళ్లుల్లు కావడం విశేషం. మున్సిపల్ సమావేశాలు నిర్వహించిన సమయాల్లో చంద్రారెడ్డి వర్గానికి చెందిన కౌన్సిలర్లు తమ వార్డులకు చైర్‌పర్సన్ రాజారాణి నిధులు కేటాయించటంలేదని సభ్యులు ఆరోపిస్తున్నారు. దీంతో మనస్తాపం చెందిన చంద్రారెడ్డి వర్గం కౌన్సిలర్లు, నాయకులు, ప్రజలు బీఆర్ఎస్‌ను వీడేందుకు సిద్ధపడ్డారు. ఇదే క్రమంలో చంద్రారెడ్డితో కాంగ్రెస్ నేత హన్మంతరావు చర్చించారు. మంత్రి దామోదర రాజనర్సింహ, నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో చర్చలు సైతం జరిగాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ పరిధిలోని నాయకులు, కార్యకర్తల కోరిక మేరకు కౌన్సిలర్ చంద్రారెడ్డి ఈ నెల 6న హైదరాబాద్‌లో ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి దామోదర సమక్షంలో కాంగ్రెస్ నేత హన్మంతరావు ఆధ్వర్యంలో చంద్రారెడ్డితో పాటు కౌన్సిలర్‌లు నిహారిక, చంద్రయ్య, గోపాలమ్మ, జయమ్మ కాంగ్రెస్‌లో చేరనున్నారు. 1000 మంది కార్యకర్తలతో బొల్లారం నుంచి భారీ ర్యాలీగా వెళ్లి చంద్రారెడ్డి వర్గం నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరనున్నారు.

బీఆర్ఎస్ నేతల వైఖరి నచ్చకనే..



సొంత పార్టీలో తమకు విలువ లేకుండా పోయింది. కాలనీల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరినా పట్టించుకోవటంలేదు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే పార్టీ మారాలనుకున్నా. ప్రస్తుతం బీఆర్ఎస్ నేతల వైఖరి నచ్చక కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నా. మున్సిపల్ కౌన్సిల్ సభ్యులపై ప్రభుత్వం విచారణ జరిపించే విధంగా పోరాటం చేస్తా.

– చంద్రారెడ్డి, కౌన్సిలర్, బొల్లారం

తీరనున్న కష్టాలు

- ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న బాబానగర్, రంజోల్ గ్రామాల ప్రజలు



హర్షం వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

సాక్షి స్పందన

జహీరాబాద్ టౌన్: మండల పరిధిలోని రంజోల్ గ్రామంతో పాటు బాబానగర్ నుంచి వికారాబాద్ జిల్లా సరిహద్దుల వరకు చేపడుతున్న రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. రంజోల్ గ్రామం నుంచి బాబానగర్ మీదుగా హుగ్గెల్లి తండా, పిచేరాగడి గ్రామ ప్రజల రాకపోకల కోసం బీటీ రోడ్డును నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రోడ్డు పనులు పూర్తయితే జహీరాబాద్–కోహీర్ మండలాల్లోని నాలుగు గ్రామాలతో పాటు పక్కనున్న వికారాబాద్ జిల్లాలోని మర్పల్లి, తాండూరు ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని ప్రభుత్వం రూ.5.10 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో 2019లో ఎమ్మెల్యే మాణిక్‌రావు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. రంజోల్ పాలిటెక్నిక్ కళాశాల నుంచి బాబానగర్, హుగ్గెల్లితండా, పిచరాగడి వరకు కంకర, మొరం పనులు చేపట్టారు. రోడ్డుపై పలు చోట్ల కల్వర్టు పనులను కూడా ప్రారంభించారు. ఆ తరువాత ఎమైందో తెలియదు కానీ రోడ్డు పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. బాబానగర్‌కు చెందిన దళిత సంఘం నాయకలు కరణం రవికుమార్ తదితరులు పలుమార్లు రోడ్డు విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై జనవరి 9న సాక్షి దినపత్రిలో 'ప్రయాణం.. నరకప్రాయం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. రోడ్డు పనులు ప్రారంభించడం పట్ల దళిత సంఘం నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చట్టం తేవాలి



కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నేత మాణిక్యం

నారాయణఖేడ్: ఆటోడ్రైవర్లు, భవన నిర్మాణ హమాలీ కార్మికులతో పాటు అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక సమగ్ర చట్టం తీసుకురావాలని సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నారాయణఖేడ్‌లో సోమవారం ఆయా రంగాల కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అసంఘటిత కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చేవిధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా రంగాల కార్మిక నాయకులు సల్మాన్, రాజు, లక్ష్మణ్, కంటెప్ప, మాణిక్యం స్వామి, శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **చెరువు ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమిస్తే చర్యలు**



పటాన్‌చెరు టౌన్: పట్టణ పరిధిలోని దోషం చెరువు ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించి నిర్మాణాలను చేపడితే వాటిని తొలగిస్తామని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ దోషం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్రహరీ నిర్మిస్తున్నారని బండ్లగూడవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కార్పొరేటర్ సోమవారం చెరువును పరిశీలించారు. అనంతరం పక్కనే ఉన్న బాలాజీనగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య ఉండడంతో పూడికతీత పనులు చేయించారు.

◆ **నియామకం**



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మై హోమ్ అంకుర విల్లాస్ కో–ఆపరేటివ్ అసోసియేషన్ సభ్యులను సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.శ్రీధర్, ఉపాధ్యక్షుడిగా దినేష్, ప్రధాన కార్యదర్శిగా గణేష్, సంయుక్త కార్యదర్శిగా రఘురాంరెడ్డి, కోశాధికారిగా ఆదిత్యరాజన్, సహాయక కోశాధికారిగా రాధికారెడ్డి, డైరెక్టర్లుగా మల్లెపల్లి రాజేందర్‌రెడ్డి, కార్తీక్, ఉషారాణి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీవాసులకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు.

◆ **అభివృద్ధి పనులను వేగవంతం చేయండి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ పుష్పనగేష్ అన్నారు. సోమవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు నాగులుగౌడ్, అశ్విన్, బిందు, మల్లేష్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఏబీవీపీ ఆధ్వర్యంలో ఖేలో భారత్ ఖేలో**

సంగారెడ్డి అర్బన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సంగారెడ్డి శాఖ ఆధ్వర్యంలో ఖేలో భారత్ ఖేలో క్రీడోత్సవాలను తార ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రికెట్ పోటీలను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జానారెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో హోప్ న్యూరో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజ్మెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి, తెలంగాణ ప్రాంత జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ లవన్‌కుమార్, మెదక్ విభాగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడ లక్ష్మణ్, జిల్లా కన్వీనర్ ఆకాష్, నిఖిల్ తానాజీ, వెంకట్, భాను ప్రకాష్, శివాజీ, శశాంక్, దినేష్ పాల్గొన్నారు.

◆ **గ్రామస్తుల సహకారంతో అభివృద్ధి**



మునిపల్లి(అందోల్): గ్రామస్తుల సహకారంతోనే గ్రామాన్ని అభివృద్ధి చేశానని సర్పంచ్ అంజిరెడ్డి అన్నారు. మండలంలోని తాటిపల్లి గ్రామంలో సర్పంచ్, వార్డుసభ్యులను సన్మానించారు. మాజీ జెడ్పీటీసీ పెంటయ్య, కాంగ్రెస్ నాయకులు వెంకటలక్ష్మారెడ్డి, సంగమేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **నియామకం**



రామచంద్రాపురం (పటాన్‌చెరు): పటాన్‌చెరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా తెల్లాపూర్‌కు చెందిన శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ తనను పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నియోజవర్గ యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా నియమించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

◆ **ఎంపీ అభ్యర్థిత్వానికి వినతి**

సంగారెడ్డి: మెదక్ ఎంపీగా పోటీ చేసేందుకు తనకు మద్దతు ఇవ్వాలని కోరుతూ బీరయ్యయాదవ్ సంగారెడ్డిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు బీరయ్యయాదవ్ తెలిపారు.